మాట్లాడుతున్న ప్రణాళిక శాఖ కార్యదర్శి విజయ్ కుమార్

నేడు మండలి నోటిఫికేషన్ విడుదల

- పశ్చిమ పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాలకు..
- స్థానిక సంస్థల మండలి స్థానానికి కూడా..
- ఎన్నికల పర్యవేక్షణకు నోడల్ అధికారులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

శాసనమండలి ఎన్నికల నోటిఫికేషన్ గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేయనుంది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు, స్థానిక సంస్థల మండలి స్థానానికి నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్ రెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పదవీ కాలం ముగుస్తుంది. ఈ రెండు స్థానాలకు ఎన్నికలను నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. అలాగే స్థానిక సంస్థల మండలి కోటా కింద కెఇ ప్రభాకర్ స్థానానికి కూడా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్లను ఈ నెల 23వ తేదీ వరకు వేయనున్నారు. 24వ తేదీన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ చేస్తారు. 27వ తేదీ వరకు నామినేషన్ల ఉప సంహరణ ఉంటుంది. అనంతరం బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. మార్చి 13న మండలి ఎన్నికలకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుంది. మార్చి 16న ఎన్నికల కౌంటింగ్ నిర్వహించనున్నారు. మార్చి 21వ తేదీ నాటికి మండలి ఎన్నికల ప్రక్రియను పూర్తి కానుంది. పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా అనంతపురం జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు. సహాయక ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా కర్నూలు, నంద్యాల జిల్లా అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి వ్యవహరిస్తారు. కర్నూలు జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ రామసుందర్ రెడ్డి వ్యవహరిస్తారు. జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 61,884 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 42,097, మహిళలు 19,586 మంది, ఇతరులు ఒకరు మాత్రమే ఉన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ పరిధిలో 5,364 మంది ఓటర్లు ఉండగా పురుషులు 2963 మంది, మహిళలు 2831 మంది ఉన్నారు. పట్టభద్రుల నియజకవర్గ పరిధిలో 74 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ నియోజకవర్గ పరిధిలో 27 పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం గుర్తించింది.

నోడల్ అధికారులు నియామకం

శాసనమండలి ఎన్నికలకు నోడల్ అధికారులను జిల్లా ఎన్నికల అధికారి నియమించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా శాంతిభద్రతల పర్యవేక్షణకు జిల్లా ఎస్‌పి, కోడ్ పర్యవేక్షణకు ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు పత్తికొండ ఆర్డీవోలు వ్యవహరిస్తారు. ఎన్నికల విధుల నిర్వహణకు సిబ్బంది నియామకాలను కలెక్టరేట్ పరిపాలనా ధికారితో పాటు జిల్లా ఎన్‌ఐసి అధికారి వ్యవహరించ నున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను జిల్లా పరిషత్ సీఈవో, పోలింగ్ మెటీరియల్ ఏర్పాటుకు డిఆర్డిఏ పిడి, ఓటింగ్‌కు అవసరమయ్యే బ్యాలెట్ పత్రాలు, పోస్టల్ బ్యాలెట్‌లను ఏర్పాటు చేసేందుకు జిల్లా పంచాయతీ అధికారి పర్యవేక్షిస్తారు. పోలింగ్ మెటీరియల్ సరఫరా, ఉద్యోగుల తరలింపునకు వాహనాలను ఏర్పాటు చేసేందుకు జిల్లా ట్రాన్స్‌ఫోర్ట్ అధికారి పర్యవేక్షిస్తారు. పోలింగ్‌కు అవసరమయ్యే బ్యాలెట్ బాక్స్‌లను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలు, పర్యవేక్షణకు నియమించిన కమిటీకి జిల్లా ఆడిట్ అధికారి పర్యవేక్షణ చేస్తారు. ఎన్నికలపై మీడియాలో వచ్చే కథనాలు వంటి వాటిని పర్యవేక్షించేందుకు జిల్లా పౌర సంబంధాల సమాచార శాఖ అధికారి చూస్తారు.

సూక్ష్మ పర్యవేక్షణ చేయాలి

- రాష్ట్ర ప్రణాళిక శాఖ కార్యదర్శి విజయ్ కుమార్
- ఉమ్మడి కర్నూల్ జిల్లా అధికారులకు వర్క్ షాప్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సూక్ష్మ పర్యవేక్షణ చేయాలని రాష్ట్ర ప్రణాళికా శాఖ కార్యదర్శి విజయ్ కుమార్ అధికారులను కోరారు. బుధవారం కర్నూల్ నగర శివారులోని కర్నూల్ కన్వెన్షన్ హాల్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లా, మండల స్థాయి అధికారులతో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు పేదలకు మరింతగా చేరేలా చూడాలన్నారు. పథకాలు పక్కగా అమలు చేసినప్పుడే సుస్థిరాభివృద్ధి జరిగే అవకాశం ఉంటుందన్నారు. అధికారులు మాత్రం నిరంతరం పర్యవేక్షణ చేసేందుకు దృష్టి సారించాలని కోరారు. మున్సిపల్ పరిపాలన శాఖ కమిషనర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ స్పందనలో వస్తున్న అర్జీలను త్వరతగతిన పరిష్కరించాలని సూచించారు. ఎక్కువగా సమస్యలు వస్తున్న శాఖల అర్జీలపై ప్రత్యేకంగా దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం సుస్థిరాభివృద్ధి లక్ష్యాల అమలు తీరుపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెరపై వివరించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని, కర్నూలు, నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్లు రామ సుందర్ రెడ్డి, నిశాంతి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్డిఏ పిడి వెంకటసుబ్బయ్య, రెండు జిల్లాల ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కోరం లేని సర్వసభ్య సమావేశం

- ఒక్కరు కూడా హాజరు కాని ఎమ్మెల్యేలు
- మొక్కుబడిగా జడ్పిటిసిలు హాజరు
- తూతూ మంత్రంగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

జిల్లాలోని ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా, ప్రతి గ్రామం, మండలం, జిల్లా వ్యాప్తంగా అభివృద్ధిపై ప్రతి 3 నెలలకు ఒకసారి నిర్వహించే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం కనీసం కోరం లేకుండానే బుధవారం కర్నూలు జిల్లా పరిషత్‌లో నిర్వహించారు. ప్రజాసమస్యలపై చర్చించి వాటి పరిస్కారం దిశగా ప్రజల గొంతును వినిపించాల్సిన ప్రజాప్రతినిధులు, జడ్పిటిసిలు నిద్రావస్థలో ఉన్నారు. కనీసం 3 నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశాలకు కూడా రాలేని పరిస్థితుల్లో ప్రజాప్రతినిధులు ఉండటం విస్మయానికి గురి చేస్తుంది. 7 స్థాయి సంఘాలుగా సమావేశాలు నిర్వహించి పలు సమశాలపై జిల్లా అధికారులు హాజరవుతున్నా కనీసం కోరం సభ్యులు కూడా హాజరు కాకపోవడం ప్రజల సమస్యలపై వీరికి ఎంత ఆసక్తి ఉందో అర్థమవుతోందని కొందరు అధికారులే వాపోతున్నారు. ఇప్పటిదాకా నిర్వహించిన సర్వసభ్య సమావేశాలకు కొత్తపల్లి, క్రిష్ణగిరి, కోడుమూరు, దొర్నిపాడు, ఓర్వకల్, ఆత్మకూరు, మిడ్తుర్, కర్నూలు, తుగ్గలి జెడ్పిటిసిలు హాజరవుతున్నట్లు సమాచారం. ఇప్పటినుండి అయినా పూర్తిస్థాయిలో ప్రజాప్రతినిధులు, జెడ్పిటిసిలు హాజరు కావాలని ప్రజలు కోరుతున్నారు.

కర్నూలు నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ భవనంలో డిప్యూటీ సిఇఒ వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి ప్రస్తుతం వేసవి కాలం సమీపిస్తున్నందున ఉమ్మడి జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రలు తీసుకోవాలన్నారు. జొలదరాశి, గాలేరు నగరి సుజల స్రవంతి పనులు, ఓర్వకల్ రిజర్వాయర్, కుందూనదిపై నిర్మాణం పనులు తదితర తాగు, సాగు నీటి సమస్యలపై వాటి పురోగతిపై చర్చించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. ఐటిడిఎ అధికారులు ఇప్పటిదాకా సమావేశాలకు రాలేదని, ఇకనుంచైనా ప్రతి సమావేశానికి హాజరై చెంచు గిరిజన ప్రాంతాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. కొత్తపల్లి జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ చెంచు నివాస గూడెంలలో కనీసం సౌకర్యాలు లేవని రోడ్లు, తాగు నీరు, కనీసం రేషన్ కూడా సక్రమంగా అందడం లేదన్నారు. ఓర్వకల్ జెడ్పిటిసి రంగనాథ్ గౌడ్ మాట్లాడుతూ హాస్పిటల్ కమిటీలు సక్రమంగా నిర్వహణ లేదని, చాలా మంది సిబ్బంది సరిగా హాజరు కావడం లేదన్నారు. మిడ్తుర్ జెడ్పిటిసి యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ గార్గేయపురం నుండి మిడ్తుర్ వెళ్లే రహదారి వేయాలని ఇప్పటికి మూడు కమిటీలలో అధికారుల దృష్టికి తీసుకొచ్చినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. క్రిష్ణగిరి జెడ్పిటిసి కెఇ సుభాషిణి మాట్లాడుతూ గ్రామాల్లో పశువులకు ఆరోగ్యం కోసం అంబులెన్స్‌లు ఉన్నాయని, వాటిని రైతుంగానికి తెలిసే విధంగా ప్రచారం చేసి పశుసంపదను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు బుజ్జమ్మ, దిల్షాద్ ముజాఫర్ నాయక్, పగిడ్యాల జెడ్పిటిసి దివ్య, జెడ్పిటిసిలు, చైర్మన్ సిసిఅశ్విని కుమార్, ఏఓ జితేంద్ర, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ప్రజాప్రతినిదులు గైర్హాజరు కావడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

పిడిఎఫ్ అభ్యర్థులకు పెరుగుతున్న ఆదరణ

- కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల మద్దతు

ప్రజాశక్తి - కర్నూల కలెక్టరేట్

శాసన మండలిలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఉన్న ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాల పక్షాన నిలుస్తూ ముందుకు సాగుతుంది. అలాంటి పిడిఎఫ్ తరపున బరిలో నిలిచినట పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలకు రోజురోజుకు ఆదరణ పెరుగుతుంది. ఈ అభ్యర్థులు ప్రజా సంఘాల మద్దతుతో ముందుకు సాగుతున్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి స్థానాలకు మార్చి 13న ఎన్నికలు జరగనున్నాయి. గతంలో మండలికి మేధావులు, విద్యావేత్తలు, సామాజికవేత్తలు వంటి వారిని పంపేవారు. రాజకీయాలకతీతంగా ఈ ఎన్నికలు జరిగేవి. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు పూర్తిగా రాజకీయ రంగుతో కొనసాగుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల తరపున బరిలో నిలిచిన అభ్యర్థులు రాజకీయాల్లో ఉన్న వారే. ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ మాత్రం ఉద్యమ నేపథ్యం కలిగిన అభ్యర్థులను రంగంలోకి దింపింది. పట్టభద్రుల శాసనమండలి స్థానానికి పోటీ చేస్తున్న డాక్టర్ పోతుల నాగరాజు అనేక సామాజిక ఉద్యమాల్లో పాల్గొన్న వ్యక్తిగా మంచి గుర్తింపు ఉంది. ఉపాధ్యాయుడిగా కొనసాగి అనంతరం ఆ వృత్తికే స్వచ్ఛంద విరమణ ఇచ్చి ప్రజా సేవలో ముందుకు సాగుతున్నారు. డాక్టర్ పోతుల నాగరాజుకు అనేక ప్రజా సంఘాలు మద్దతు పలికాయి. సిఐటియు, ఎఐటియుసి, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డివైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, యుటిఎఫ్, ఎస్‌టియు, రూటా, బిటిఏ, జెవివి, ఆర్ఇఎఫ్, బీసీటియు, ఏపీఎంఎస్‌టిఎఫ్, ఎంఈడబ్ల్యుఏ సంఘాలతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆయనకు మద్దతుగా పెద్ద ఎత్తున ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రచారం కూడా కొనసాగుతుంది. ఉపాధ్యాయ మండలి స్థానానికి పిడిఎఫ్ బలపరిచిన అభ్యర్థి ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పోటీలో నిలిచారు. ఈయన పిడిఎఫ్ కూటమిలో సభ్యుడిగా కూడా కొనసాగి మండలిలో ఉపాధ్యాయ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై, ప్రభుత్వ విద్యా విధానం బలోపేతంపై అనేకసార్లు చర్చల్లో పాల్గొని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. సిపిఎస్ రద్దు, పిఆర్సి ఉద్యమం వంటి వాటిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మద్దతు తెలిపారు. ఆ ఉద్యమాల్లో కత్తి నరసింహారెడ్డి కూడా పాల్గొన్నారు. కత్తి నరసింహారెడ్డికి యుటిఎఫ్, ఎస్టీయూ, రూటా, కేజీబీవీ ఉపాధ్యాయులు, కాంట్రాక్టు లెక్చరర్లతోపాటు అనేక సంఘాలు మద్దతు ఇస్తున్నాయి. పిడిఎఫ్ కూటమిపై ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక వర్గాల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ వర్గాలు ఎదుర్కొనే సమస్యలపై ఎక్కడ ఉద్యమాలు జరిగినా పిడిఎఫ్ కూటమి శాసనమండలి సభ్యులు పాల్గొని వారికి మద్దతుగా నిలుస్తూ ప్రభుత్వాల తీరును ఎండగడుతున్నారు. అలాంటి పిడిఎఫ్ కూటమి తరపున బరిలో నిలిచిన డాక్టర్ పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలకు రోజురోజుకు ఆదరణ పెరుగుతుంది. నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్న పిడిఎఫ్ అభ్యర్థులు అన్ని వర్గాల నుండి మద్దతు కూడగడతున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి

ప్రశాంతంగా 'నైతిక మానవతా విలువ' పరీక్ష

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు బుధవారం నైతిక మరియు మానవతా విలువ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షను మొత్తం 306 కళాశాలలో నిర్వహించారు. జనరల్ కేటగిరీ కింద విద్యార్థులు 3,892 మంది హాజరు కావాల్సి ఉండగా 3036 మంది హాజరయ్యారు. 532 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులు చదివే విద్యార్థులు 2880 మందికి గాను 2752 మంది హాజరయ్యారు. 128 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐఓ ఎస్‌విఎస్ గురువయ్య శెట్టి తెలిపారు.

వైసిపి ప్రజలతో చెలగాటమాడుతోంది : టిడిపి

ప్రజాశక్తి - గూడూరు

వైసిపి ప్రభుత్వం మూడుముక్కల ఆటతో రాష్ట్ర ప్రజలను చెలగాటమాడుతోందని తెలుగు యువత కర్నూల్ పార్లమెంట్ కార్యదర్శి చరణ్ కుమార్, కెడిసిసి మాజీ డైరెక్టర్ రాజారెడ్డి, నీటి సంఘం మాజీ అధ్యక్షులు చెట్టుకింద మదిలేటి పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాజధాని అమరావతిపై రోజుకొక మాట మాట్లాడుతూ ప్రజల్ని మభ్యపెడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా వైసిపి ప్రభుత్వం ప్రజలను మోసం చేయకుండా అభివృద్ధి పనులు చేయాలన్నారు. సీనియర్ నాయకులు అయ్యావారి నాయుడు, వివి కిషోర్ వర్మ టి నాగరాజు, పొన్నగంటి గజేంద్ర, రేవుల రామకృష్ణ, అంపమ్మ గారి సుంకన్న, మానవపాడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎపిపిఎస్‌సి మెయిన్ పరీక్షలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

గ్రేడ్-2 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీలో భాగంగా ఏపిపిఎస్‌సి మెయిన్ పరీక్షలు గురువారం ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నగర శివారులోని కెవి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు పర్యాయాలు పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్వీఎస్ నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ పరీక్షలకు 183 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు.

నేడు రిటైల్ ఋణ మేళా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం కర్నూల్ వారు నేడు రిటైల్ ఋణ మేళాను జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ వెంకటనారాయణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఋణ మేళా కార్యక్రమం ద్వారా గృహ, వాహన, విద్య, స్థిరాస్తి తనఖా, ప్రాపర్టీ అద్దె మీద లోన్‌లపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

యనగండ్లలో తాగునీరు వృధా..

ప్రజాశక్తి - సి బెళగల్

మండలంలోని యనగండ్లలో తాగునీరు యథేచ్ఛగా వృధా అవుతోంది. నది తీరంలో నుండి ఇక్కడికి పైప్‌లైన్ ద్వారా నీటిని ఈ ట్యాంకులోకి వదులుతున్నారు. అయితే వేళాపాలా లేకుండా నీటిని వదులుతుండటం ఫలితంగా ట్యాంకు నిండి నీరు వృధా అవుతోంది. అది కూడా సీసీ రోడ్డుపై పారుతుండటం ప్రజలకు ఇబ్బందిగా మారింది. పక్కనే పాఠశాల విద్యార్థులు కూడా రావాలన్నా, వెళ్లాలన్నా అవస్థలు పడుతున్నారు. అధికారులకు, స్టానిక సర్పంచులకు తెలిసినా చర్యలు శూన్యమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వృధాగా పోతున్న నీరు

కర్నూలు జిల్లాకు వైసిపి ప్రభుత్వం ద్రోహం

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

విశాఖ ఒక్కటే రాజధాని, కర్నూల్‌లో హైకోర్టు కాదు బెంచ్ మాత్రమే అని ఆర్థిక మంత్రి ప్రకటించడం కర్నూలు జిల్లా ప్రజలకు ద్రోహం చేయడమేనని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన తన ప్రకటనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇన్నాళ్లు పాలన వికేంద్రీకరణ పేరుతో మూడు రాజధానుల పాట పాడుతున్న వైసిపి ప్రభుత్వం అసలు రంగు ఇప్పుడు బయటపడిందని విమర్శించారు. రాయలసీమ మహాగర్జన పేరుతో సభలు పెట్టి ప్రజలను మోసం చేసిన నాయకులు నేడు ఎక్కడికి వెళ్లారని, ఈ ప్రభుత్వం ప్రకటించిన ప్రకటన చూసిన మేల్కొనాలని హితవు పలికారు. మూడు రాజధానులు అంటూ ఏమీ లేవని రాష్ట్రానికి విశాఖ ఒక్కటే ఏకైక రాజధాని అని మంత్రి బుగ్గన చెప్పడం దారుణమని పేర్కొన్నారు. కర్నూల్‌కు న్యాయ రాజధాని అని సంకలు గుద్దుకుని చెప్పిన వైసిపి ఎమ్మెల్యేలు మంత్రి ప్రకటనపై ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని, లేకపోతే ఎమ్మెల్యేల పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో ధార్వాడ్‌లో ఒక బెంచ్, గుల్బర్గాలో మరో బెంచ్, కర్నూల్‌లో ఒక బెంచ్ మాత్రం ఏర్పాటు చేస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కర్నూలు జిల్లా ప్రజలు వైసిపి ప్రభుత్వం అసలు రంగు బయటపడిన తర్వాత అయినా మేల్కొనాలని తెలిపారు. అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించినప్పుడు కూడా మాట్లాడకుండా మౌనంగా ఉండి వైసిపి నాయకులు కర్నూలు జిల్లాకు ద్రోహం చేశారని, మళ్లీ కర్నూల్‌లో హైకోర్టు కాదు బెంచ్ అని మరొకసారి ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. కర్నూలు జిల్లా ప్రజల ఓట్లు వేయించుకోవడం తప్ప, ఈ జిల్లాకు ఏమి చేయకుండా ఉండాలనే దృఢమైన నిశ్చయంతో వైసిపి ప్రభుత్వం ఉందని చాలా స్పష్టంగా అర్థం అవుతుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలు వైసిపి ప్రభుత్వ అసలు రంగును గుర్తించి న్యాయ రాజధాని కోసం, అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం ఆపడం కోసం ఉద్యమాలకు రావాలని పిలుపునిచ్చారు.

అలరించిన అన్నమయ్య సంగీత నృత్య నీరాజనం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

అన్నమయ్య జానపద కళాక్షేత్రం, కోవిద సహృదయ ఫౌండేషన్ హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో రెండురోజులుగా సాగిన సంగీత నృత్య నీరాజనం నగర ప్రజలను అలరించింది. చిన్నారులు అన్నమయ్య సంకీర్తనలకు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బుధవారం స్థానిక టిజివి కళాక్షేత్రంలో ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర స్వామి, తిరుపతి బ్రహ్మర్షి బివి. రెడ్డి, కళాబంధు డాక్టర్ జి.అనూహ్యరెడ్డి, ప్రొడ్యూసర్, వ్యవస్థాపకురాలు కోవిద సహృదయ ఫౌండేషన్, హైదరాబాద్, యంఆర్‌కె. రవి శంకర్ గురూజి మహా ఆచార్య, యోగా మాస్టర్, ఆత్మీయ ప్రతినిధులు, ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, సామాజిక సంఘ సేవకులు డాక్టర్ బి.శంకర్ శర్మ, ఎండోక్రినాలజీ డాక్టర్ బి.భరత్, జానపద కళాకారుల సంఘం జగన్ మోహన్ రావు అధ్యక్షులు తిరుపతి, పత్తి ఓబులయ్య, ఎస్.రాజేష్ రెడ్డి, కర్నూలు ఆయిల్స్ అధినేతలు జ్యోతి ప్రజ్వలన చేశారు. అన్నమయ్య కీర్తనలను విశ్వవ్యాపితం చేస్తామని నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో జెఎన్.శేషయ్య, రంగస్వామి, ఎలమర్తి రమణయ్య, పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ తదితరులు

అనుమానాస్పద స్థితిలో మాజీ సర్పంచి భర్త మృతి

ప్రజాశక్తి - తుగ్గలి

మండలంంలోని జొన్నగిరి గ్రామంలో మాజీ సర్పంచు లక్ష్మీదేవి భర్త హేమ్లా నాయక్ (54) బుధవారం తన పొలం సమీపంలో ఉన్న వంకలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎవరైనా చంపి అక్కడ పారేశారా, లేక ఏదైనా పాయిజన్ తాగి మృతి చెందాడా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హేమ్లా నాయక్‌కు భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న జొన్నగిరి ఎస్సై రామాంజనేయులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చివరకు న్యాయమే గెలుస్తుంది

- వెంకట శివ సాయి నగర్‌లో కోర్టు ఆదేశాలతో హెచ్చరిక బోర్డు
- నగర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చెన్నయ్య

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కొంతమంది కబ్జాదారులు ఆక్రమించిన ప్లాట్లపై ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఇచ్చిన తీర్పు ప్లాట్ల యజమానులకు ఊరట కలిగించిందని వెంకట శివ సాయి నగర్ అసోసియేషన్ అధ్యక్షులు చెన్నయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓఎస్ నంబర్ 7/23 ప్రిన్సిపుల్ సీనియర్ సివిల్ జడ్జి కర్నూల్ వారి ఆదేశాల మేరకు 789 సర్వే నంబర్‌లోని వెంకట శివ సాయి నగర్‌లో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. చెన్నయ్య మాట్లాడుతూ కోర్టులో కేసు నడుస్తుందని, చివరకు న్యాయం గెలిచి ప్లాట్లు యజమానులకు దక్కుతాయన్నారు. భూ కబ్జాదారులు పారి పోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్లాట్ల యజమానులు ధనుంజయ, మాదేశ్, బీసన్న, మిన్నెల్ల, దేవదాస్, వినోద్, భారతమ్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంకట శివ సాయి నగర్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ప్లాట్ల యజమానులు

పరిశీలిస్తున్న డిడిఎ

పంట పొలాలను డిడిఎ సందర్శన

ప్రజాశక్తి - సి బెళగల్

మండలంలోని తుంగభద్ర నది తీరం వెంట రైతులు సాగు చేసిన పంటలను డిడిఏ వెంకటేశ్వర్లు బుధవారం సందర్శించారు. సంగాల, తిమ్మందొడ్డి, పలుకుదొడ్డి గ్రామాల్లో వేరుశనగ, ఉల్లి, వరి, శనగ, పత్తి, టమోటో, జొన్న వంటి పంటలను పరిశీలించి ఖరీఫ్, రబీ సాగులకు నీటి వనరులు, స్థాయి విస్తీర్ణత వంటివి రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఈ పంట నమోదుపై అవగాహన క్షేత్రస్థాయిలో కల్పించి గ్రామాల్లో రైతులకు విస్తృతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడిఏ బాలవర్ధి రాజు, ఏఓ మల్లేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

ప్రజాశక్తి - సి.బెళగల్

ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ఎస్ఐ పీరయ్య సూచించారు. బుధవారం మండలంలోని ఈర్లదిన్నె, సింగవరం గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అతి వేగం ప్రమాదకరమని, క్షణాల్లో ప్రాణాలు పోగొట్టుకోవడం ఏ పాటిదన్నారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చని, రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు.

గ్రంథాలయ నిర్వహణ భేష్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాలయం నిర్వహణ బాగుందని, రికార్డ్ పరంగా, మంచిగా ఉందని రాష్ట్ర పౌర గ్రంథాలయాల సంచాలకులు ఎంఆర్.ప్రసన్నకుమార్ తెలిపారు. బుధవారం కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాలయంను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది మరింత జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మద్దూర్ సుభాష్ చంద్ర బోస్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాష్‌లను కలిసి గ్రంథాలయాల అభివృద్ధికి సూచనలు చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

రాష్ట్ర పోటీలకు హత్తిబెళగల్ విద్యార్థులు

ప్రజాశక్తి - ఆలూరు

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా క్రీడా పోటీలకు హత్తిబెళగల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం సుధాకర్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత నెలలో కర్నూల్‌లో జరిగిన సెలక్షన్‌లో హతిబెలగల్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఈ నెల 19న అనంతపురం ఉరువకొండలో జరిగే పోటీల్లో అండర్-14లో కె.రియాజ్, వరుణ్ కుమార్, బాలికల విభాగంలో మానస, అండర్-17లో పి.రోషన్, ఎం.చాందిని పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎంతో పాటుఉపాధ్యాయులు అభినందించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎపి ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మస్తాన్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడారు. 15 సంవత్సరాలుగా పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆరకొర జీత భత్యాలతో జీవనం సాగిస్తున్నారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని పాదయాత్రలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నెరవేర్చి ఆదుకోవాలన్నారు. మెడికల్ సెలవులు మంజూరు చేయాలని, ఈఎస్ఐ, ఈపిఎఫ్ కట్టాలని ఇప్పటికే పలు మార్లు ప్రభుత్వంను కోరామని స్పందన లేదన్నారు.

సిబలను ఒత్తిడికి గురి చేయరాదు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

పొదుపు గ్రూప్‌లు, సభ్యుల పర్యవేక్షణ, బ్యాంక్ లింకేజీ రుణాల రికవరీ, మెప్మా పరిధిలో చేయాల్సిన పనులు కాదని ఇతర డిపార్ట్మెంట్‌కు సంబంధించిన సర్వేలు, రెవెన్యూ పనులు, జిల్లా అధికారులు నిర్వహించే సమావేశాలకు సమీకరణ వంటివి జిల్లా అధికారులు మెప్మా అధికారులు సిబలపై అదనపు పని భారం పెంచి వత్తిడికి గురి చేయడం మానుకోవాలని సిఐటియు నాయకులు వి.వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. హౌసింగ్ సర్వే, టిడ్కో ఇళ్లకు రాబడి, బ్యాంక్ అధికారులు, ఫీల్డ్ ఆఫీసర్ చేయాల్సిన పనులు, సచివాలయ సిబ్బంది చేయాల్సిన చెత్త పన్ను వసూలుకు టార్గెట్ పెట్టి పొదుపు గ్రూప్ సభ్యులపైన కూడా వత్తిడి పెంచే విధంగా జిల్లా అధికారులు ప్రవర్తించడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. పని ఒత్తిడికి వ్యతిరేకంగా జిల్లాలో ఉండే సిబలు ఐక్యంగా ఉండి పోరాడాలన్నారు.

క్షేత్రగుడి చెక్‌పోస్టును డిఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి - హాలహర్వి

క్షేత్రగుడి చెక్ పోస్టను ఆదోని డిఎస్‌పి వినోద్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. సిబ్బందికి కర్ణాటక నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని, అక్రమ మద్యం రాకుండా అరికట్టాలని, హెల్మెట్, సీట్ బెల్ట్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐ విజయ్ కుమార్, కానిస్టేబుళ్లు గోవర్ధన్, అయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడే వారిని చట్టసభలకు పంపాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ - పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రజా సంఘాల విస్తృత ప్రచారం

ఆదోనిలో ప్రచారం నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

నిరుద్యోగుల సమస్యలపై పోరాడే వ్యక్తులను చట్టసభలకు పంపాల్సిన అవసరం ఉందని సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ, యుటిఎఫ్ పట్టణ కార్యదర్శి సునీల్ రాజ్ కుమార్, నాయకులు లక్ష్మన్న అన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహా రెడ్డిలకు మద్దతుగా బుధవారం ఆదోని పట్టణంలోని విస్తృత ప్రచారం నిర్వహించారు. హనుమాన్ నగర్, ప్రభుత్వ పాఠశాల, అర్బన్ హెల్త్ సెంటర్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. పిడిఎఫ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహా రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. **నందవరం :** రాయలసీమ పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమ నేతలను ఎన్నుకోవాలని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ సి. గురు శేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, రైతు సంఘం నాయకులు పంపన్న గౌడ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు విజయేంద్ర నాయుడు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లేష్ అన్నారు. నందవరంలోఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ పోతుల నాగరాజు అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు నాగేష్, కెవిపిఎస్ జిల్లా నాయకులు నాగప్ప, ఎఐటియుసి, సిఐటియు, డివైఎఫ్ఐ, చేతి వృత్తుదారుల సంఘం నాయకులు పాల్గొన్నారు. **కర్నూలు కార్పొరేషన్ :** పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, వేయించి గెలిపించాలని సిఐటియు నాయకులు పట్టభద్రులను కోరారు. కర్నూలు నగరంలోని కవాడీ వీధి, తెలుగు వీధిలలోని పట్టభద్ర ఓటర్లను సిఐటియు నాయకులు, అబ్దుల్ దేశాయ్, మొహమ్మద్ షరీఫ్, రవికుమార్, జయమ్మలు కలిసి పోతుల నాగరాజును గెలిపించాలని కోరారు. స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు. **మంత్రాలయం :** చట్ట సభల్లో సమస్యలపై గళం విప్పి ప్రశ్నించే నాయకులను ఎన్నుకోవాలని సిఐటియు మండల కార్యదర్శి హెచ్. జయరాజు కోరారు. మండల కేంద్రంలో సిఐటియు మండల అధ్యక్షులు వీరేష్ ఆధ్వర్యంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ పోస్టర్లను విడుదల చేశారు. కెవిపిఎస్ నాయకులు రాజు, రైతు సంఘాల నాయకులు జయన్న, ప్రకాష్, బిల్డింగ్ కార్మికులు దయాకర్ తదితరులు పాల్గొన్నారు. **ఆలూరు :** పిడిఎఫ్, యుటిఎఫ్, ఎస్టియు, వివిధ ప్రజాసంఘాలు బలపరుస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యతతో ఓటు వేసి గెలిపించాలని సిఐటియు, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అరికెర గ్రామంలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కెపి.నారాయణస్వామి, మండల కార్యదర్శి షాకీర్, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైన, గోపాల్ పాల్గొన్నారు. **ఆదోనిరూరల్ :** మండలంలోని పెద్దహరివానం, సంతేకూడ్లూర్ గ్రామాల్లో స్థానిక హైస్కూలు, ప్రయివేట్ స్కూలు, సచివాలయంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కెవిపిఎస్ మండల ప్రధాన కార్యదర్శి బి.తిక్కప్ప, ఎపి డప్పు కళాకారుల సంఘం మండల కార్యదర్శి లక్ష్మన్నలు ప్రచారం నిర్వహించారు. కెవిపిఎస్ నాయకులు పరమేష్, సిద్ధప్ప పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు :** పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి, డాక్టర్ పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, తాలూకా ప్రధాన కార్యదర్శి బి.రాముడు, చేతి వృత్తిదారుల జిల్లా నాయకులు సి గోవిందులు కోరారు. పట్టణంలోని తాలూకా కోర్టు, జిల్లా పరిషత్ పాఠశాలలో, సచివాలయాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ తిమ్మన్న, ఎస్ఎఫ్ఐ తాలూకా కార్యదర్శి ఎస్ విజయ్ తదితరులు పాల్గొన్నారు. **కర్నూలు హాస్పిటల్ :** ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజుకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, వేయించి గెలిపించాలని సిఐటియు నాయకులు సాయిబాబా, లక్ష్మయ్య, ఏసు పట్టభద్రులను కోరారు. కల్లూరు అర్బన్ ఎంపీడీవో కార్యాలయం, వార్డు సచివాలయం, బిసి స్టడీ సర్కిల్, కల్లూరు తాసిల్దార్ కార్యాలయంలో వారు విస్తృత ప్రచారం నిర్వహించారు.

మంత్రాలయంలో పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలులో ప్రచారం నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

ఎమ్మిగనూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కల్లూరు పరిధిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నందవరంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నియోజకవర్గంలో రోడ్లన్నీ త్వరలో పూర్తి చేయిస్తా

- కార్మిక శాఖ మంత్రి మంత్రి గుమ్మనూరు జయరాం
- ఒకే వేదికపై గుమ్మనూరు జయరాం, కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి - హొళగుంద

ఆలూరు నియోజకవర్గంలో ప్రతి రోడ్డు నిర్మాణ పనులు సంబంధిత శాఖ గుత్తేదారులతో మాట్లాడి పూర్తి చేయిస్తానని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. బుధవారం మండలంలోని హెబ్బటం గ్రామంలో శివ స్వాముల ఆధ్వర్యంలో ఐదు జంటలకు సామూహిక వివాహాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, టిడిపి ఆలూరు నియోజకవర్గం బాధ్యురాలు, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలే శాశ్వతం కాదని, ఎన్నికల కన్నా ముందు ఇరువురం ఇదే దేవాలయం దగ్గర కలిశామని, ఇప్పుడు కూడా శివ స్వాముల పుణ్యమా అని ఒకే వేదికపై కలవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు దేవర గట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఎంపిటిసి ఉరుకుందప్ప, మాజీ జెడ్పిటిసి అయ్యాలప్ప, ముక్కురా నందీస్, వైసిపి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం

'అప్పర్ భద్ర'ను వెంటనే ఆపాలి : మహానంది

ప్రజాశక్తి - ఆలూరు : అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం నిర్ణయాన్ని వెంటనే ఆపాలని వేదవతి నీటి సాధన సమితి తాలూక నాయకులు జి.మహానంది డిమాండ్ చేశారు. బుధవారం ఆలూరు బెల్లిగుండు ఆంజనేయస్వామి ఆలయంలో వేదవతి నీటి సాధన సమితి ఆధ్వర్యంలో హాలహర్వి సర్పంచ్ మల్లికార్జున అధ్యక్షన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక రాష్ట్ర ఎన్నికల్లో లబ్ధి పొందాలని లక్ష్యంతో చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్ట్ అక్రమ నీటి ప్రాజెక్టుని తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు అక్రమ ప్రాజెక్టును నిలుపుదల చేసే విధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. మాజీ సర్పంచి వెంకటేష్, ఈరన్న, బసాపురం ఈరన్న, లక్ష్మీనారాయణ, పెద్దహ్యాట వీరభద్ర, కరువప్ప, వీరేష్, నగరూరు చంద్ర, లింగప్ప, చిన్న రంగయ్య, కొండయ్య, పాల్గొన్నారు.

సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో బుధవారం అల్ సెక్ టెక్నాలజీస్ డ్రైవ్ జాబ్ మేళా విజయవంతమయింది. ప్లేస్‌మెంట్ ప్రోగ్రాంలో వివిధ కళాశాలల నుండి 8 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. చెన్నైకు ఐదు మంది, బెంగుళూరుకు ముగ్గురు ఎంపికయ్యారు. ఏ ఇంద్రావతి బిఎస్‌సి, బి దీప్తి బిఎస్‌సి, ఎం నందిని బిఎస్‌సి, బి హుస్సేనీ బీకాం, కె వీరేష్ బిఎస్‌సి, రాజమ్మ బిఎస్‌సి, శ్రీలక్ష్మి బిఎస్‌సి, వైష్ణవి బిఎస్‌సి అలసెక్ టెక్నాలజీ కంపెనీకి ఎంపికయ్యారు. సిద్ధార్థ డిగ్రీ కాలేజ్ కరస్పాండెంట్ వేణుగోపాలాచారి, కాలేజ్ ప్రిన్సిపల్ కమల సుజాత, అధ్యాపక బృందం ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఇప్పటివరకు ఎమ్మిగనూరు చరిత్రలోనే నిరుద్యోగులకు జాబ్ మేళా కల్పించే ఏకైక కాలేజ్ సిద్ధార్థ డిగ్రీ కాలేజ్ అని తెలియజేశారు.

ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులు

అరసం రాష్ట్ర కార్యదర్శిగా కలం ప్రహ్లాద

ప్రజాశక్తి - ఆదోని

అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఆదోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కలం ప్రహ్లాద ఎన్నికయ్యారు. ఈ నెల 10న తెనాలిలో జరిగిన రాష్ట్ర మహాసభలో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఆయన ఎన్నిక పట్ల ఎస్టియు పట్టణ నాయకులు నాగరాజు రమేష్ నాయుడు, లోక్య నాయక్ ,రవి, వీర చంద్ర యాదవ్, జంబులయ్య హర్షం వ్యక్తం చేశారు.

నేడు ఎపిఎఫ్ఆర్ఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మున్సిపల్ ఉద్యోగులు, ఒప్పంద కార్మికుల జీతాలకు, ఉద్యోగులకు ఎసరు పెట్టే ఏపిఎఫ్ఆర్ఎస్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ నేడు కర్నూల్ నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

టిబి లక్షణాలపై అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని నేషనల్ స్కూలులో బుధవారం కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి, హెచ్ఎం విజయ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టిబి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మేఘన, ఎంపిహెచ్ఎస్ బాబురాజు మాట్లాడుతూ టిబి లక్షణాలు, చికిత్స అంశాలపై వివరించారు. సత్యశ్రీ, టిబి హెచ్‌వి మనోరంజినీ దేవి, ఆశా వర్కర్ రఫీయా బేగం, ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పప్పు శనగను మద్దతు ధరకు అమ్ముకోండి : ఎఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వం కల్పించిన కనీస మద్దతు ధర క్వింటా రూ.5335లకు పప్పు శనగను అమ్ముకోవాలని ఏవో ఆనంద్ రైతులకు సూచించారు. బుధవారం చిప్పగిరి వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈక్రాప్, ఈకెవైసి చేయించుకున్న రైతులందరూ కూడా ప్రభుత్వం కల్పించిన కనీసం మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంట అమ్మదలుచుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకుని రశీదు పొందాలన్నారు. ఏఈఓ రమాదేవి పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - ఆదోనిరూరల్

మండలంలోని సలకలకొండ గ్రామంలో శ్రీకృష్ణ ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్టాపన పురస్కరించుకొని గత రెండు రోజులుగా దేవాలయంలో హెూమాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఆలయం ముఖద్వారం, కలశ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువ నాయకులు జయ మనోజ్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పార్టీ కార్యాలయాలకు ప్రభుత్వ స్థలాలు తగదు : టిడిపి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రభుత్వ స్థలాలపై వైసిపి ప్రభుత్వం కన్నేసి పార్టీ కార్యాలయాలకు 100 కోట్లకు పైగా విలువైన భూములను కేటాయిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం బాధాకరమని తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం కర్నూలు కార్యదర్శి చంద్రకళాబాయి తెలిపారు. కర్నూల్ నగరంలోనే 49వ వార్డు ప్రకాష్ నగర్‌లో ఏపీ ఆగ్రోస్ స్థలం ఫ్లకార్డ్స్ పట్టుకొని ప్రభుత్వ స్థలాలలో ప్రభుత్వ కార్యాలయాలే నిర్మించాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక కర్నూలు నగర అధ్యక్షురాలు మీసాల సుమలత ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఏపీ ఆగ్రోస్ ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 95-2 బిలోని 1.60 ఎకరాల స్థలం వైసిపి కార్యాలయానికి కేటాయిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో కర్రెమ్మ, శేషమ్మ, చిన్న శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్, గఫూర్, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

ఇన్సురెన్స్ పడని రైతులకు న్యాయం చేయండి

తుగ్గలి : మండలం పరిధిలోని వివిధ గ్రామాలలో 2021-22 సంవత్సరం ఇన్సూరెన్స్ పడని రైతులకు వెంటనే వర్తింపచేయాలని రైతు సంఘం మండల కమిటీ అధ్యక్షులు శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తుగ్గలిలోని వ్యవసాయ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు రైతు సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చాలా మంది రైతులకు ఇన్సూరెన్స్ పడలేదన్నారు. ఇన్సూరెన్స్ పడలేదని గతంలో కూడా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఇంతవరకు రైతులకు ఇన్సూరెన్స్ వర్తింప చేయలేదన్నారు. ఇన్సూరెన్స్ పడకుంటే దశల వారిగా ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవత ఉత్సవాలు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని దొమ్మలదిన్నె గ్రామంలో గ్రామ దేవత ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రజలు కుంభాలతో బయలుదేరి దేవతకు మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలలో వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి, మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాదచారి, కౌతాళం సర్పంచి పాల్‌దినకరణ్, ఉప సర్పంచి తిక్కయ్య, అబ్దుల్ సమద్‌లు పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే టిడిపి మంత్రాలయం యువ నాయకులు దివాకర్ రెడ్డి, ఉరుకుంద ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్లు చెన్న బసప్ప, శివ మోహన్ రెడ్డి, టిడిపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజు, మైనారిటీ నాయకులు టిప్పు సుల్తాన్, కొట్రేష్ గౌడ్, రాజానందు తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు.

గ్రామ దేవతకు పూజలు నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ప్రమాదకరంగా గుంత

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణం అమరావతి నగర్ కాలనీలో కొత్త అమరావతి ఏరియాకు వెళ్లే దారిలో గుంత ప్రమాదకరంగా మారింది. కొన్ని నెలల క్రితం మంచినీటి పైపులైన్ లీకేజీ అయిందని మరమ్మతుల పనుల కోసం గుంతను తీశారు. అనంతరం గుంతను పూడ్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. రోడ్డు పక్కన గుంత ఉండడం వల్ల అందులో ఎవరైనా పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పైపులను లీకేజ్ మరమ్మతులు చేసి వెంటనే గుంతలు పూడ్చాలని సిపిఎం నాయకుడు తిక్కప్ప కోరారు.

పప్పు శనగను రూ.7 వేల ప్రకారం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు జిల్లాలో పప్పు శనగను మార్క్ ఫెడ్ ద్వారా క్వింటా రూ. 7 వేల ప్రకారం కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు మార్క్‌ఫెడ్ అధికారి రాజుకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు ఇంతవరకు ప్రారంభించలేదని, పప్పుశనగ పంటను జిల్లాలో ఆస్పరి, దేవనకొండ, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద, ఆలూరు, కోసిగి, మంత్రాలయం, కోడుమూరు, కల్లూరు మండలాల్లో రైతులు పండించా రన్నారు. ఈ పంటకు ఎకరానికి 40 వేల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టారని, డిసెంబర్ చివరి నాటికి పంట దిగుబడి చేతికి రాగా ధర మాత్రం రూ.4500 మాత్రమే ఉందన్నారు. గత 3 సంవత్సరాలుగా ఇదే ధర ఉందని, ప్రతి ఏటా సాగు ఖర్చులు పెరుగుతున్నా ధర పెరగడం లేదన్నారు. క్వింటాల్ ధర కనీసం 7 వేల రూపాయలు ఉంటేనే రైతులకు గిట్టుబాటు అవుతుందన్నారు. ఈ ప్రభుత్వం హయాంలో దళారులు బాగుపడ్డారు కానీ రైతులు ఏమాత్రం బాగుపడలేదన్నారు. కార్యక్రమంలో సిపిఐ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాసులు, ఇర్మియ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కోసిగి రూరల్

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ కోసిగి మండల కమిటీని బుధవారం జిల్లా అధ్యక్షులు జె. ఎల్లప్ప ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా డి నాగన్న, అధ్యక్షులుగా విజయకుమార్, ప్రధాన కార్యదర్శిగా ఏ లక్ష్మీకాంతరెడ్డి, సహాధ్యక్షులుగా రంగన్న, నాగ స్వర్ణలత ,కార్యదర్శులుగా కే చిన్న వీరన్న, కిరణ్ కుమార్,నిర్మల, నరసన్న, అయ్య స్వాములు ,కోశాధికారిగా ఆర్ .నగేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా మల్లారి నాగరాజు ,భాస్కర్, తులసమ్మ, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి అందరూ కృషి చేయాలని నాయకులను కోరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన కమిటీ నాయకులు

మహారాజ శ్రీ కర్నూలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S NO. 597/ 2019

కురువ రామ సుబ్బయ్య @ హోటల్ సుబ్బయ్య. ...వాది

-Vs-

B.నూర్ అహ్మద్ పోతివారసులు మౌలాలి బీ వగైరా ...ప్రతివాదులు

3వ ప్రతివాదికి దావా సమన్లు

3. సుమీరా తండ్రి లేట్ B. నూర్ అహ్మద్
R/o హుస్సేనాపురం గ్రామము,
ఓర్వకల్లు (మం), కర్నూలు జిల్లా.

పై నంబరు దావాలో వాది లేట్ B. నూర్ అహ్మద్ అస్తుల దావా మొత్తము రూ. 1,71,666/- లు, ఇందుపైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో 3వ ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 2-3-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 2-3-2023

Y.Prakash Reddy,
వాది పరం న్యాయవాది,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A. No. 892/2017 in I.A. No. 990/2016 in O.S. No. 684/2000

S.వెంకటేశ్వర్లు. ...వాది/ అర్జీదారు

-Vs-

S.వెంకటరాముడు పోతివారసులు వగైరా.
...ప్రతివాదులు/ రెస్పాండెంట్లు

1,2 రెస్పాండెంట్లకు నోటీసులు
(ఆర్డర్ 22 రూలు 1,2, & 4 C.P.C మరియు
(రూలు 28 & 29 సివిల్ రూల్స్ ప్రకారం)

1. S.మహేంద్రమణి భర్త S. మల్లికార్జున
2. S.T. వెంకటసాయి తండ్రి లేట్ S. మల్లికార్జున,
ఇద్దరు డోర్ నెం. 65/83-C, కోట కర్నూలు.

పై నంబరు దావాలో 4వ ప్రతివాది అయిన S. మల్లికార్జున తండ్రి S.C. లక్ష్మయ్య చనిపోయినందున అతనికి పై కనపరచిన 1,2 రెస్పాండెంట్లు వారసులుగా చేర్చమని అర్జీదారు అర్జీ దాఖలు చేసినాడు. ఇందులో 1,2 రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 20-02-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 20-02-2023

M.వెంకోబ రావు,
M.శివరామ చంద్ర రావు,
వాది/ అర్జీదారు పరం న్యాయవాదులు,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S . NO. 1190 / 2021

అభయ్‌కుమార్ C.షా వగైరా. ...వాదులు

-Vs-

కనికె.నాగప్ప వగైరా. ...ప్రతివాదులు

1వ ప్రతివాదికి దావా సమన్లు

1. కనికె.నాగప్ప తండ్రి కె. మల్లన్న,
గోనెగండ్ల గ్రామం, కర్నూలు జిల్లా.

పై నంబరు దావా లో వాది దావా షెడ్యూలు దాఖలా ఆస్తికి పర్మినెంట్ ఇజంన్‌క్షన్ ఉత్తర్వు కోరి మరియు దావా షెడ్యూలు దాఖలా ఆస్తిలో ప్రతివాదులు గానీ వారి మనుషులు గానీ ప్రవేశించ కుండా వాది యొక్క హక్కుకు భంగం కలిగించకుండా ఉత్తర్వు ఇప్పించమని మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ దావా దాఖలు చేసినాడు. ఇందులో 1వ ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 24-02-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

షెడ్యూలు: కర్నూలు జిల్లా కల్లూరు సబ్ - రిజిస్ట్రేషన్ జిల్లా, కల్లూరు గ్రామం సర్వే నం.83 యక. 1.49 సెంట్లు, నక్కల దేవ చేను.
తూర్పు - సర్వే నం.78 పడమర - సర్వే నం.80
ఉత్తరం - కర్నులు బళ్ళారి రెడ్డు
దక్షిణం - సర్వే నం.84 వాగుల యొక్క భూమి.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 24-02-2023

G.భార్గవి,
వాదుల పరం న్యాయవాది,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S . NO. 947/ 2020

S.G. నాగమ్మ. ...వాది

-Vs-

షేక్.చాంద్ బాషా వగైరా. ...ప్రతివాదులు

2వ ప్రతివాదికి దావా సమన్లు

2. P. లేపాక్షి రెడ్డి తండ్రి P. వీరా రెడ్డి, ఇంటి నెం.2-40 పార్ల పల్లి గ్రామం, ఎమ్మిగనూరు (మం), కర్నూలు జిల్లా.

పై నంబరు దావా లో వాది దావా షెడ్యూలు దాఖలా ఆస్తికి తానే హక్కుదారుడనని సదరు ఆస్తిలో 1,2, ప్రతివాదులు గానీ వారి మనుషులు గానీ ప్రవేశించకుండా వాది యొక్క స్వాధీనాన్నీ మరియు హక్కును భంగం కలిగించకుండా కాన్సుక్యూషనల్ ఇంజన్‌క్షన్ ఉత్తర్వు కోరుతూ దావా దాఖలు చేసినాడు. ఇందులో 2వ ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 22-02-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

SCHEDULE : Plot no.59 situated in Sy.no. 128/1, 128/3, 340 in Sri Shiva Keshava Nagar with LP No. 78/82 for an extent of 272.22 sq yards situated within the village limits of Kallur and within the Sub-Registration of Kallur in Kurnool Dist., Bounded by:
East : 40 feet road, West : Plot no.58, North : 33 feet road, South :Plot no.64.
Market Value : 14,15,544 /-

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 22-02-2023

D.భాస్కర్ రెడ్డి,
D.సత్య నారాయణ రెడ్డి,
వాది పరం న్యాయవాదులు,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A No. 167/2020 in O.S . NO. 947/ 2020

S.G. నాగమ్మ. ...వాది/అర్జీదారు

-Vs-

షేక్.చాంద్ బాషా వగైరా.
...ప్రతివాదులు/ రెస్పాండెంట్లు

2వ రెస్పాండెంటు (ప్రతివాది) కు ఆర్డర్ 39
రూలు1& 2 మరియు C.P.C ప్రకారం నోటీసులు

2. P. లేపాక్షి రెడ్డి తండ్రి P. వీరా రెడ్డి,
ఇంటి నెం.2-40 పార్ల పల్లి గ్రామం,
ఎమ్మిగనూరు (మం), కర్నూలు జిల్లా.

పై నంబరు దావా లో వాది దావా షెడ్యూలు దాఖలా ఆస్తికి తానే హక్కుదారుడనని తన యొక్క స్వాధీనాన్నీ మరియు హక్కును భంగం కలిగించకుండా కోరుతూ దావా దాఖలు చేస్తు. ఇందులో ప్రతివాదులు గానీ వారి మనుషులు గానీ ప్రవేశించకుండా ఇంటిరిమ్ ఇంజన్‌క్షన్ ఉత్తర్వు కోరి అర్జీదారు అర్జీ దాఖలు చసినది. ఇందులో 2వ రెస్పాండెంటు అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 22-02-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

SCHEDULE : Plot no.59 situated in Sy.no. 128/1, 128/3, 340 in Sri Shiva Keshava Nagar with LP No. 78/82 for an extent of 272.22 sq yards situated within the village limits of Kallur and within the Sub-Registration of Kallur in Kurnool Dist., Bounded by:
East : 40 feet road, West : Plot no.58, North : 33 feet road, South :Plot no.64.
Market Value : 14,15,544 /-

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 22-02-2023

D.భాస్కర్ రెడ్డి,
D.సత్య నారాయణ రెడ్డి,
వాది పరం న్యాయవాదులు, కర్నూలు.